అవతలి వైపు

డా. అక్కిరాజు రమాపతిరావు

రంగనాథరావుకి ఉలికిపడినట్లు మెలకువ వచ్చింది. ఒకటే, రెండు, మూడు. తలుపుమీద చేతి చరపులు వినవస్తున్నాయి. బద్ధకంగా ఒత్తిగిల్లాడు. కొంచెం విరామం. మళ్ళా తలుపుమీద చప్పుడు. ఈ సారి చాలా కోపంవచ్చింది. లిప్త పాటు నిరీక్షించాడు. సుభద్రలేస్తుందేమోనని. ఊహూ. ఆవిడ హాయిగా పవ్వళించే వుంది. విసురుగా పోయి తలుపు తెరచాడు. సన్న తుంపరులు పడుతున్నట్లున్నది. ఆహ్లాదకరమైన అనుభూతిని కలగచేసే వాతావరణం. చిరుచలి. ఇంకా సూర్యుడి కిరణాలు చెట్ల చివరలకైనా చేరలేదు. 'అమ్మగారు ఇయ్యాల శేరు పాలు ఎక్కువతెమ్మన్నారు?' అంటోంది పాల మనిషి. కళ్ళ కేమిటో కొత్తగా వుంది. మాంచి బింకమైన వయసులో, మంచు బిందువులు పడిన ముద్దబంతి పూవులాగుంది, పాలగిన్నె కిందపెడుతున్న వయసులోవున్న ఆడకూతురు. 'ఎవరు నువ్వు' అన్నాడు, రావు. 'నాను తెల్దేటీ'అని పళ్ళు పదీ కనపడేలా తళుక్కున నవ్వింది. 'మా లక్ష్మిని కాదేటి?'అని పలికింది. ఆసి వీ దుంపతెగ. ఎంతలావాళ్ళు చేశావే'—అనుకున్నాడు రావు. టీపాయ్‌మీద గంగాళంలాటిగిన్నె వుంటే దాన్నితెచ్చి పాలు పోయించుకున్నాడు. మాలక్ష్మి వెళ్ళిపోయింది.

రావు మళ్ళా తలుపు గడియపెట్టి పక్కమీద కూచొన్నాడు. టీపాయ్‌మీద సిగరెట్‌పెట్టితీసుకుని, సిగరెట్ వెలిగించాడు. సుభద్ర వేపు చూశాడు. ఇటువేపు ఒత్తిగిలి పడుకుంది. బుజంమీద ఆచ్ఛాదన పక్కకిజారి పోయింది. పెదవుల మీద తిరిపోయిన అలసటను సూచిస్తున్న చిరునవ్వు. పెదవుల్లో సౌకుమార్యంలేదు. మొద్దుబారిపోయి వున్నాయి. ముసలి చిరునవ్వు అనుకున్నాడు. అట్లా సుభద్రను చూడగానే చిరాకు పుట్టుకొచ్చింది రావుకు. ఈ పెదవులనేనా, గులాబి రెక్కలనీ, మందార మొగ్గలనీ, నాల్రోజులు పుట్టింట వుండవలసి వచ్చిన పెళ్ళాన్ని ఆకాశానికెత్తేస్తూ తాను ఉత్తరాలు వ్రాసింది. ఒళ్ళు గరుపొడిచింది. ఒదులుఒదులుగా రవిక వేళ్ళాడిపోతున్నది. జుట్టంతా చిందరవందరగా వుంది. నిన్న సాయంకాలం తలంటుకొని వుంటుంది. లెక్క పెట్టటానికి వీలుగా తెల్లటి వెంట్రుకలు కనపడుతున్నాయి.

గాలిపోయినటైరూ, పొగిపోయినరబ్బరూ, అరిగిపోయిన జోడూ, ఆ గదిలోనే అక్కడాఅక్కడా కన్పించాయి. సుభద్రవేపు చూశాడు. సిగరెట్టు పొగతో గుండెంతా వెచ్చబడింది. సుభద్ర చెయ్యిమీద చెయ్యివేసి గాజులు సవరించాడు. చెయ్యికాస్త వెనక్కు లాక్కుంది. భువనైక సుందరి. రుబ్బురోలులా అటునుంచి ఇటు కదిలింది. అబ్బా, ఆ ముసలి నవ్వు. ఆ పెదవులపైన నల్లనిచారలు. రావుకి కష్టమనిపించింది.

బయటవాన పెద్దదయింది. పది నిముషాలు తక్కువ ఆరు. అయినా ఇంకా ఐదుకూడా కానట్లే వుంది.

సుభద్ర కళ్ళు తెరిచింది. ఆకళ్ళ చుట్టూ నల్లని వలయాలు. భావగర్భితంగా నవ్వింది తనవేపు చూసి. మెడకింద ముడతలు ముడతలుగా జారిపోతోంది శరీరం. రావు నవ్వలేదు. నవ్వు రాలేదు.

'పాలమనిషి వచ్చిందా?'

రావు విసుక్కున్నాడు.

'ఎక్కువ పోయించుకున్నారా?'

'తప్పుతుందా, నువు చెప్పిన తరువాత'.

'ఆహా ఏం భయభక్తులు!' అని వెటకారంగా ఆమె పయట బయటకు తీసి బుజాల చుట్టూ కప్పుకుంది. పొట్ట దగ్గర చూశాడు. ముడతలు ముడతలుగా పొట్ట కిందికిజారిపోయింది.

'ఇవాళ ఎంత పనుందో! వేగిరం లేపకపోయారా'అంటూ లేచి, ఊడిపోయిన జుట్టును, కొప్పుగా ముడుచుకుంది. ఇంట్లోకి వెళ్ళిపోయింది. వరండా తలుపు తీసి. రావుకి చాలాకోపం వచ్చింది. పాతికేళ్ళుగా కాపురం చేస్తున్నా, ఎప్పుడు ఏ విధంగా ప్రవర్తిస్తే తనకు నచ్చుతుందో సుభద్రకు తెలీదు. ఐదుగురు పిల్లలైతే కలిగారు. రావుకి చాలా అసంతృప్తి కలిగింది. ఆ తలుపు దగ్గరగావేసిపోవాలని తోచలేదు సుభద్రకు. మళ్ళీ వెల్లకిలాపడుకుని దుప్పటి కంఠం వరకూ లాక్కున్నాడు రావు. హాల్లో పిల్లల్ని నిద్రలేపుతోంది సుభద్ర. 'బాబ్జి, అక్క ఇవాళ వచ్చేస్తుంది. వేగిరంలే, సుందరం, నువ్వు స్టేషన్‌కి వెళ్ళొద్దూ. లే, పళ్ళు తోముకో, కాఫీ తాగు. మార్కెట్‌కు వెళ్ళాలి. అరటిపళ్ళు గెల తేవాలి, లేలే.!' ఈ ఒకటే హడావుడి చేసేస్తున్నది.

పక్కమీదినుంచి లేవబుద్ధి పుట్టటంలేదు రావుకి. నరాల్లో ఏవిటో వెచ్చగా, మత్తుగా శక్తిపాకుతోంది. వెలిసిపోయిన దుప్పటిలా, మాసిపోయిన తలగడలా, సుభద్ర కులో

స్తున్నది. పాలు పోయటానికి వచ్చిన పిల్ల మాలక్ష్మి ఎంత బింకంగా వుంది! వీధివాకిలిపక్కనే ఆకులురాలిపోయిన బాదంచెట్టుకనపడుతున్నది. పై కొమ్మలమాత్రం అక్కడక్కడ పండుటాకులున్నాయి. వరండాలో కంచుగంటలా ఎవరిదో గొంతు వినపడుతున్నది.

'అమ్మగారో, సుభద్రమ్మగారో'. రావుకి పక్కమీద నుంచి లేవాలనిలేదు. తనగదిలోంచి వరండాలోకి పోయే తలుపులు బార్లా తీసిలేవుగాని, పూర్తిగా వేసీలేవు. చూశాడు.

కూరల తట్ట దింపుకొంటోంది. ఎవరో మనిషి. ఆడ కూతురు. సుభద్ర వచ్చి చేయేసి సాయంచేసింది. పొరపాటు చేశాడు తాను. చప్పునపోయి తాను చేయివేయాల్సింది. కూరల తట్టపైకి పూర్తిగా పైటజారిపోయింది. మళ్ళా ఆపైటను, కూరలమ్మి బుజాలమీద కప్పుకునే దాకా గుండె దడదడ కొట్టుకుంది రావుకు. పటుపైనకొప్పు. కోక బిరుగాకట్టింది. పొట్ట దగ్గర ముడతలు లేవు. కళ్ళు నవ్వుతున్నాయి.

'బోణి మనింటికాడనే చేద్దామని వచ్చానమ్మా. మళ్ళా ఏరింటుకైనా పోతే, తాజాసరకుకాదని మీరంటారు' అంటోంది. బుజాలమీద రవిక తడిసి చర్మానికి అంటుకున్నది. బయట చిన్న జల్లులోంచి వచ్చిందామె. పైటతో ముఖం తుడుచుకుంది. శిలలో మలచినట్లుగా వుంది. సుభద్ర బేరాలా పొరాలా చేస్తోంది. 'ఏసుకోండమ్మా, ఇంతలో నేను పెడిపోయేదిలేదు. ఈ ఇంటికాడ తిని బతికినదాన్నేను' అంటోంది. ఆ గొంతు ఎక్కడో విన్నట్లుగా వుంది. ఆ నవ్వు ఎక్కడనో చూసినట్లుగా వుంది. ఆ వాలకం ఎప్పుడో తన కళ్ళ పడ్డట్లూవుంది. ఆశ్చర్యం. మంచందిగి ఆ మనిషిని పరకాయించి చూడాలనిపిస్తోంది రావుకు. సుభద్ర కూరల బేరం ముగిసింది. కూరలమ్మి తట్ట ఎత్తుకొని వెనక్కు తిరిగింది. రావు సిగరెట్ అవతల పారేసి లేచి కూచున్నాడు. 'కందిరీగ నడుముదాన, కాళ్ళ కడియాలదాన'. ఎక్కడిదో యీ పాట. యీ భావం. తళుక్కున మనసులో స్ఫురిస్తుండగానే, కూరలమ్మి వరండా దిగిపోయింది. రత్తాలేనా? అన్న అనుమానంలో పడ్డాడు. వానజల్లు తెరిపిన పడ్డది. రావు వీధి వాకిట్లోకి వచ్చి చూశాడు. పని మనిషి వాకిలి చిమ్ముతోంది. దూరంగా కూరలమ్మి, తన బరువో, తట్టబరువో, లయగా పిరుదులు కదలేట్లు వెళుతోంది. బావుండదని లోపల కొచ్చేశాడు రావు.

సుభద్ర కూరలన్నీ బుట్టలో కెత్తుతోంది.

'ఎంత ఖర్చు చేశావ్ పొద్దున్నే'.

'ఏం రాసుకోవాలా'

రావుకి చిరెత్తుకొచ్చింది. తానొక్కడే ఇంట్లో పిసినారి వాడు. సుఖంగా, హాయిగా భారుభూరున బ్రతకలేదు. ఎవరికయినా బాధలేదు. తమ ఇష్టం వచ్చినట్లు తాము ఖర్చు చేస్తారు. స్వేచ్ఛగా, నిబ్బరంగా వుంటారు. తన ఒక్కడిదే సంసారమైనట్లు తనకే సంసారపు జాగ్రత్త అంతా. చిరాకునంతా అణచుకొని చిరునవ్వుతో,

'ఎవరీ మనిషి కొత్తగా వుందే అన్నాడు యథాలాపంగా అడిగినట్లు జాగ్రత్త పడుతూ.

'రత్తాలు తెలీదండీ. మన పెళ్ళినాటికి మనింటో పని చేస్తుండేది'. రావు వెళ్ళి మళ్ళీ పక్కమీద కూచున్నాడు. దుప్పటినిండా కప్పుకున్నాడు. సిగరెట్ వెలిగించాడు.

రత్తాలు. పచ్చగా, దబ్బపండులాగా, బొంగరంలాగా వుండేది. చీపురు పుచ్చుకుని గదులన్నీ శుభ్రం చేస్తుంటే నక్కి నక్కి వెనకవెనక తిరిగేవాడుతాను. కిటికీలోంచి, అరుగుమీది నించీ వంటింటిగడపమీదనుంచీ పులుకూపులుకూ చూసేవాడు తాను. పాతికేళ్ళక్రింద. రత్తాలు కళ్ళు తనకళ్ళతో కలిస్తే ఎండకు కగ్గిన పువ్వుల్లా కళ్ళు వాల్చేసుకునేవాడు. 'ఛా నాకు సిగ్గు, ఇప్పుడా' అనేది రత్తాలు. తనకు భయం. అసహ్యం. చీదర. పెళ్ళైంది. రత్తాలుకీ తరువాత పెళ్ళయిందట. రత్తాలును ఎప్పుడూ, దగ్గరగా తాకలేదు. చూడలేదు. పాతికేళ్ల నాటిమాట. ఆ రోజులు గుర్తు వచ్చినప్పుడల్లా తనమీదతనకే ఎన్నోసార్లు అసహ్యమయ్యేది. విసుగ్గేసేది. కోపం కలిగేది. కాని తరువాత రోజులుగడిచిపోయినయ్. సంపాదన. పురువు. ప్రతిష్ఠ. పిల్లలు. చదువులు. ఉద్యోగాలు. పెళ్ళిళ్ళు —తన చుట్టూ గిరిగీసిన గీతలు.

సుభద్ర వచ్చి చూసింది, ఇదేం విడ్డూరమమ్మా!అన్నట్టు గా! ''ఇవాళ ఇంకోసారి కాఫీ కలపను, త్వరగా తెములుతారా? తెమలరా''. రావుకి విసుగొచ్చింది. సుభద్ర చేతులనిండా బొగ్గు మసి. ఆర్పేసిన కుంపటిలాగా వుంది. తనకు చలిగా వుంది, గుండెల్లో వెచ్చగావుంది. నరాల్లో వింతగా వుంది. రావు లేచాడు. కాఫీతాగాడు.

కచ్చేరి గదిలో కూచున్నాడు.

ఇంకా రత్తాలే కళ్ళముందూ, కాగితాలముందూ, కనపడుతున్నది. పెద్దకూతుర్నివాళ పెద్ద కుర్రాడు, అత్తారింటి నుంచి తీసుకుని వస్తున్నాడు. సుభద్ర చేసే ఆర్భాటాని కంతా అర్థం అదే.

రేడియోలో తెలుగు వార్తలు వినపడుతున్నాయి. 'వాతావరణం పొడిగా వుండదు. ఆకాశం మేఘావృతంగా వుంటుంది. అడపాదడపా జల్లులు పడవచ్చు.'

సుందరం అప్పుడే స్నానం చేసి వచ్చాడులా వుంది. 'అమ్మ పది రూపాయలిమ్మంటోంది' అంటున్నాడు, ఎదురుగానిల్చుని. రావుకి చాలాకోపం వచ్చింది. తాను లక్షలులక్షలు సంపాదిస్తున్నాడనీ, సంపాదిస్తాడనీ అనుకుంటోంది గాబోలు సుభద్ర.

'ఎందుకట? అన్నాడు విసుగ్గా. 'అరటిపళ్ళా, తమలపాకులా, చామంతిపూలా, అగరొత్తులా, పసుపూ, కుంకుమా' సుందరం లిస్టు చదివాడు. రావుకి బుర్రవేడెక్కింది. నిన్న సాయంకాలం సుభద్ర బజారెళ్ళి రెండువందలు ఖర్చు పెట్టింది. నూట ముప్పై రూపాయల చీర కొంది. అమ్మడు పూడిదలకు ఇంకా ఏమిటేమిటో అర్థంలేని ఖర్చులు. ఉడికి పోతూనే పదిరూపాయలనోటు ఇచ్చి పంపించాడు సుందరానికి.

సుందరం మళ్ళా అమ్మదగ్గరకు వెళ్ళాడు సంప్రతింపులలకు. వాడట్లా వీధిలోకి వెళ్ళగానే సుభద్రవచ్చి, 'ఈ పూట వంట మనిషికి కబురెడదాము. లడ్డూలు కట్టించాలి' అంది. రావుకి చాలా కోపంవచ్చి కుర్చీలో కుతకుతలాడాడు. ఆ కోపంలో చేతిలో వున్న లాజార్నల్ వాల్యూము, అట్టలూడి చేతిలోకొచ్చి, పుస్తకం క్రింద పడిపోయింది. అట్టమీద సంవత్సరం చూశాడు. పాతికేళ్ళ క్రిందటిది. సుభద్ర వయసు—అప్పుడే వచ్చిం దీవాల్యూమ్‌కు.

'సరే పిలిపించు'.

క్రిందికి వంగి పుస్తకం తీశాడు. ముసలివాసన వస్తోంది పుస్తకం. సుభద్ర లోపలకి వెళ్ళిపోయింది.

తనకు భయం. ఏమాటా తాను కాదనలేడు. అందరూ తన మీద అధికారం చేలాయించే వాళ్ళే. తను భీరువు. అసమర్థుడు. చేతకానివాడు. పరువు ప్రతిష్ఠలు, గౌరవమర్యాదలు, తనకు వంకెళ్ళు. ఉరులు.

అమ్మడు, రాజా, సుందరం, పద్మ, బాబ్జీ అందరూ తనపైని అధికారం చెలాయిస్తారు. తాను ధైర్యంగా, ఉద్రేకంగా, అతిశయంగా, దర్పంగా, తృప్తిగా, చేసిన ఒక్కటంటే ఒక్కపని ఏమిటి? ఎప్పుడైన చేశాడా? అవాళ ఒకరోజు రత్నాలు, నాన్నగారాఫీసుకువెళ్ళీ, అమ్మ పురాణానికి వెళ్ళీ, మధ్యాహ్నం తన గదిపూద్చేప్పుడు, తలుపు దగ్గరగావేసి తనవేపు చూసి అదోలానవ్వితే, తనకు చెమటలు పట్టి, ఒణికిపోతే, తలుపు తీసి నవ్వుతూ వెళ్ళిపోలేదు.

రావు మనసంతా ఇవాళ అదోలావుంది. చీదరగా, చికాకుగా, అసంతృప్తిగా.

రోజులానే పదింటికి కోర్టుకెళ్ళిపోయినాడు. పిండివంటా, అదీ సాయంత్రానికిగానికాదు, అన్నది సుభద్ర. 'నామొహన పోనీ పచ్చడి మెతుకులే కొట్టు' అనుకున్నాడు మనసులో రావు. మూడింటికి సుందరం కోర్టుకి కాఫీ పట్టుకొచ్చాడు. వాడి మొహం సినిమా కెళ్ళేముందులా కళకళలాడిపోతున్నది. 'అక్కయ్యొచ్చింది నాన్నా, రైలు గంటలేటు. సాయంత్రం మనింటో పేరంటం. అక్కయ్యతో అత్తగారు కూడా వచ్చారు. అన్నయ్య బజారుకెళ్ళి, చీరా, రవికా తెచ్చాడు. అక్కఅత్తగారికి పెట్టాలట. మీరుక్లబ్బుకెళ్ళి ఏడుకో, ఎనిమిదికో రాండి'అని సుందరం పరిగెత్తుకుని వెళ్ళాడు. రావు ఉస్సురని నిట్టూర్చాడు. అవాళ నిజానికి కోర్టులో పనికూడా లేదు. ఎక్కడికీ పోవాలనిపించలేదు. మధ్యాహ్నం లడ్డు కట్టివుంటారు. జిలేబీ చుట్టివుంటారు. చూశావా, సుభద్ర తనను గుర్తించుకొని పంపనైనాలేదు— ఆడది, అతిశయానికి ముందో వెనకోపుట్టి వుంటుంది. మగవాడ దానిబానిస. వాడిశక్తినంతా హరించివేసి వాణ్ణి ఆడిస్తుంది. పెళ్ళితో మగవాడినోటికళ్ళెం ఆడదాని చేతి కొస్తుంది. అటు తరువాత యావజ్జీవమూ గుర్రం మగవాడూ, సంసారం మోతబరువూనూ—

ఐదు గంటలైంతరువాత ఎటు పోవాల్సిందీ తోచలేదు రావుకు. కోర్టు ఆవరణ దాటి బయటకు వచ్చిన తర్వాత ఒకరిద్దరు మిత్రులు పలకరించారు, క్లబ్బుకు ఆహ్వానిస్తూ. రావు హోటల్‌కెళ్ళి స్వీట్ తిని కాఫీ త్రాగాడు. తన హక్కులేవో తాను గుర్తిస్తూ ఇప్పుడిప్పుడే నిలుపుకొంటున్నట్లు అనిపించింది. క్లబ్బువేపు వెళ్ళాడు. పేకాటంటే మోజులేదు, అంటాడు ఇతరులతో. తనకు తెలుసు. తను పిరికి. తనకు భయం. నా పెద్ద సంపాదన పరుడుకాదు. గొప్పగా అనుభవించే సాహసం లేదు జీవితాన్ని. రెండుమూడు న్యూస్ పేపర్సు చూశాడు. న్యూస్‌అంతా ఒక్కటే కాబట్టి, ప్రత్యేకంగా వ్యాపార ప్రకటనలు చూశాడు. ఒక బొమ్మ బాగా ఆకర్షించిందతణ్ణి. నడుము సన్నం దగ్గరకాకుండా, ఇంకా బాగా కిందికి చీరకట్టి, వీపు కనపడేలా వెనుతిరిగి విలాసంగా నిలుచుని ఊా చీరకటితే అందం, ఆనందం, స్వర్గం, సంతోషం, అంటోందో యువతి. పెద్దకొప్పు. రత్నాలు జ్ఞాపకం వచ్చింది చటుక్కున రావుకు. మనస్సంతా ఉసూరు మనిపించింది. ఎవరో పలకరించారు దూరంనుండి, లోకాభిరామాయణంలో కలవమని. రావు మనసుకి వాళ్ళతో చేరాలనిపించలేదు. ఇంటికి వెళ్ళేందుకు లేదు. ఆ పకపకలూ, హాస్యాలూ, ముసలి ముత్తైదులూ, పసి పిల్లల వెక్కిళ్ళూ, చీదుళ్ళూ, తాను భరించలేడు. ఈ చీరలు ఖరీదైనవేకాని, ఎందుకో తనకు నచ్చవు. అరచేతి మందం వెడల్పు జరీలూ, బోసిదవడలూ, పెద్దపెద్ద బొట్లు. వెక్లి సుల గూర్చి, పెళ్ళిళ్ళను గూర్చీ, కడుపులను గూర్చీ, కాన్పులను గూర్చీ కోలాహలంగా మాట్లాడుకుంటారు. అవే మర్యాదలు, అవే మన్ననలు. విసుగులేదు. వేసటలేదు వాళ్ళకు.

రావు చల్లగాలికి వూరి బయట దాకా నడచివద్దామని బయలుదేరాడు. ఆకాశం మేఘావృతంగా వుంది. వాతావరణం మనోజ్ఞంగా వుంది.

వూరి కోలాహలాన్ని తప్పుకుంటూ, నెమ్మదిగా వూరి బయటకు వచ్చేశాడు.

తన చిన్నతనంలో అక్కడ ఏడాదికి ఆరునెలలు టూరింగ్ టాకీస్ వుండేది. ఇంటర్‌పాసై, బి.ఏ.లో చేరి ఒక సంవత్సరం గడిచిందాకా, రహస్యంగా భయంభయంగా నేల టిక్కెట్టు

తీసుకుని తాను సినిమాలు చూసే వాడక్కడ. ఇప్పుడక్కడ పర్మనెంట్ హాలు కట్టేశారు. చుట్టూకిల్లీబడ్డీలూ, న్యూస్ పేపర్‌స్టాల్సూ, పకోడీలూ, ముంతకిందపప్పూ, మానె మిఠాయిలూ అమ్మే చిన్నచిన్నదుకాణాలూ, చాలాసందడిగా వుంది ఆ ప్రదేశమంతా. ఇరుకువాడలూ మురికి గోడలూ, పిరికిసిడలూ వెకిలి జాడలూ, ఇప్పుడక్కడ. ఇంకాముందుకు నడిచాడు రావు. మదనమోహన్ టాకీస్‌లో నుండి 'బృందావన మందిరిదీ' అని కీచు గొంతుతో పాత రికార్డు గోల పెడుతున్నది. జనం పల్చగానే వున్నారు, సినిమాహాలుముందు. చిన్న తనాన, ముంత కిందపప్పు మెరపకాయబజీలూ, అటూఇటూ చూసి, కొనేసి తినేసేవాడు. ఇప్పుడు నోరూరావాయీ కళ్ళూకాళ్ళూ అన్నీకట్టేసు కోవాలి. అన్యాయం. ఈ మెరపకాయ బజ్జీలమ్మే వ్యక్తి పాతి కేళ్లుగా అమ్ముతున్నాడు. ఇతని తండ్రి అమ్మేప్పుడు పక్కన వుండి పొట్లాలుకట్టి ఇస్తుండేవాడు. ఇప్పుడు తాను యజమాని అయినాడు. రావుకి మిరపకాయ బజ్జీలు తినాలనివుంది. కాని అశక్తతతో ముందుకి వెళ్లాడు. తన జరీకండువా, పైన తలపాగా వెక్కిరించాయి. బాగా ముందుకి నడిచి పొలాలమధ్య రోడ్డు పైకివచ్చేశాడు. అప్రయత్నంగా వెనుదిరిగి చూశాడు. సినిమాహాలుపై నల్లైటు ఉజ్జ్వలంగా కానవస్తున్నది. నమో వెంకటేశా, నమో శ్రీనివాసా అని అరిగిఅరిగి అరుస్తోంది లౌడ్‌స్పీకర్. అనుకోకుండా ఆకాశంకేసి చూశాడు. చల్లనిగాలి, వర్షపువాసనను మోసుకొచ్చి, శరీరాన్ని తాకింది. వానవచ్చే లాగుంది. తానేధ్యాసలో ఇంతదూరం వచ్చాడు. వేగంగా వెనుదిరిగి నడవటం సాగించాడు రావు. సినిమా హాలునుండికాక ప్రక్కగా ఊళ్లోకి దగ్గర దోవుంది. ఊళ్లోకి వస్తే రిక్షా అయినా దొరుకుతుంది. వడివడిగా నడుస్తున్నాడు రావు. ఊళ్లోకివచ్చి తానుప్రవేశించిన సందుగొందులను తలచుకు సిగ్గుపడ్డాడు రావు. ఇంతలో చిరుజల్లు అతణ్ణి పరామర్శించింది. నిముషంలోనే వాన ఇంకా కొంచెం పెద్దదైంది. కళ్ళముందు రిక్షాకూడా కనరాలేదు.

చాలా ఇరకాటమైన పరిస్థితి. తాను చిన్నపిల్లాడిలా పరిగెత్తలేడు. తప్పలేదు. పక్కనేవున్న అరుగుల ఇల్లు చూరు కింద ఓరగా నిలుచున్నాడు రావు. అటూ ఇటూ చూస్తున్నాడు రిక్షా కోసం. ఆ వీధిలో ఎవ్వరూ నడవడం లేదు. ఎదురుగా చిన్న పెంకుటింటి వీధితలుపులు తెరుచుకున్నాయి. 'బాబుగారూ రాండి. ఒక్క నిముషం కూచునిపోదురు' అని ఓర కళ్ళతో, ఒంటివిరుపుతో, గౌరవమో, అభిమానమో, రత్తాలు పిలుస్తున్నది. రావుకి కాళ్ళలోనూ, గుండెల్లోనూ దడ ప్రవేశించింది. రత్తాలు తన కళ్ళలో ఆంక్ష పెట్టిందో, కాంక్ష పెట్టిందో, రావులో తిరుగుబాటు ధోరణి, ఉద్రేకమూ, ధీమా కలిగాయి. అటూఇటూ చూశాడు. తన నక్కడ ఎవ్వరూ గుర్తుపట్టేవాళ్ళు లేరు.

చప్పున ఎదురునడచి రత్తాలువాళ్ళింట్లోకి వెళ్ళాడు. తాను పిరికివాణ్ణి కానని జీవితంలో ఒక్కసారైనా నిరూపించుకోవాలి. రత్తాలు పాతకుర్చీ చూపించింది. రావు కూర్చున్నాడు. కొంచెం దూరంలో నేలమీద చతికిలబడి కూర్చున్నది రత్తాలు. రావుకి ఏం మాట్లాడాలో, రత్తాలుకు ఏం మాట్లాడించాలో, అర్థంకావటంలేదు. ఊరినిండా దీపాలు వెలిగాయి. గొంగడి పురుగు సీతాకోకచిలకైనట్లుగా సంజకాస్త చీకటైపోయింది. రత్తాలు కొప్పునిండా చామంతిపూలు పెట్టుకుంది. అప్పుడే సాయంత్రం భోజనం అయిందేమో తాంబూలం కూడా వేసింది. ఆ గదిలో చౌకరకం సెంటువాసన కూడా వస్తున్నది. రావు శరీరానికి ఉక్కగావుంది. చెమటపడుతున్నది. గాలి ఆడుతున్నట్లులేదు. తనకు రత్తాలుపైన కోర్కె వున్నట్లు సంజ్ఞలు ఎట్లాచెయ్యాలి? ఒకవేళ రత్తాలు ఇష్టపడితే, తాను సంకోచం విడిచిపెట్టవచ్చునా? ఈ ఒక్కసారి తాను ఏదో భ్రాంతి తీర్చుకుంటే తన పరువుమర్యాదలకు భంగమా? భ్రాంతి ఏం. సుఖమంటే రత్తాలుతోనే నిజమైన సుఖముంటుంది. పొద్దున్న నిద్రలేవగానే సుభద్ర రూపం గుర్తుకొచ్చింది రావుకు.

రత్తాలు అదోలా చూసింది రావును. రత్తాలుతో ఏమనాలో తోచటంలేదు రావుకు. ఒకవేళ తాను లేచిపోయి రత్తాల్ని చేయిపట్టుకుంటే, తననిగూర్చి ఏమనుకుంటుందో రత్తాలు. లోపల ఈసడించుకుంటుందా? లోకువకడుతుందా? అయ్యగారూ, ఇదేంటి — అంటుందా.

రావుకు ముచ్చెమటలు పోస్తున్నాయి. చెవికింద దోమ ఏదో పరామర్శించి సంగీతం పాడుతూ వెళ్ళింది. వీధి వాకిటి మురికికాలువ వాసనకూడా పలకరించి పోయింది. రత్తాలు పైట జారినా మళ్ళీ తీసుకోలేదు.

బాత్‌రూంలో, రంగనాథం, గ్రంథసాంగుడేనోయ్, ఏమో ఏమో ననుకున్నాం, అని తోటి లాయర్లు చెవులు కొరుక్కుంటున్నట్లూ, మర్రోజు పొద్దున్నే రత్తాలు కూరల తట్టతో వచ్చి, తననిచూసీ, సుభద్రను చూసీ—ఓసి నీ ధీమా నాకు తెలీదా అని భావగర్భితంగా నవ్వినట్లూ. రావు వణికి పోయినాడు.

'ఈ ఊరెప్పుడొచ్చావు?' అన్నాడు పొడిగా, నిస్సారంగా. తాను నిజంగా పెద మనిషే సుమా అని హెచ్చరిస్తున్నట్లు. ఇంకా లోపల భయం పీకుతున్నది. మొగుడూ మొద్దులా ఏమైనట్లు. లేక ఎవరైనా తలుపుతోసుకుని వస్తే. తాను వెనక వచ్చాడు. తలుపు తానైతే వేసిరాలేదు.

'నెలరోజులైంది' అన్నది రత్తాలు. పొడిగానే.

'నీ మొగుడేం చేస్తాడు?'

రత్తాలు నిర్లక్ష్యంగా నవ్వింది. 'ఓయ్! వాపెళ్ళిసంగతి మీకు గుర్తుందే. ఆడు లారీ డ్రైవరు. తాగితాగి యాగ్సిడెంటై చచ్చాడు. ఈడ యీరసామని గుర్రబ్బండాడుండే వాడు. ఆణ్ణి సాయంచేసుకున్నాను కొన్నాళ్ళు. ఆడితో ఆ

ఊరు, ఆ ఊరూ తిరిగాను. ఆడెవత్తేనో మరిగి, ఒకటి రెండు సార్లు చేయిచేసుకొన్నాడు. 'ఓరి ఎదవనాయాలా, నీవేఏటి నాకుదిక్కు' అని ఒగ్గే శానాణ్ణి. ఏమైనా పుట్టిపెరిగినూరు, మమకారంపోక, యీడికే జేరా. మా అమ్మకాలంజేపెగా. ఈ ఇల్లు ఐదు రూపాయలద్దె. కూరలమ్మితే నా బతుకు గడవదా అని యీ యాపారం మొదలు చేశాను.ఇదీ కుదరకపోతే మానేత్తా. నాకేం పరువా ప్రతిట్టా, పిల్లాపాపా?! మొగుడామొద్దులా. సిగ్గా శరమా, నేనడవిలో చెట్టును. ఎండా,గాలీ, వానా, వాగూ, వంటిదాన్ని.

రావు అడిగాడు. 'వాన తగ్గిందా?'

ఓరగా చూసింది రత్తాలు. 'బిరాన ఇంటికెళ్ళాలా?'

రత్తాలు నవ్వింది. 'సిన్నప్పటి బయంపోలేదు'.

రావుకు తల కొట్టినట్లనిపించింది. తన బ్రతుకు, పార్కులో పదిరోజుల కోసారి మాలి కత్తిరించివేసే కాగితపు పూల చెట్టు లాటిది. తనఇష్టం వచ్చినట్లు తాను గాలీ, ఎండా, వేడీ, వెల్తురూ, చూసేందుకులేదు. ఏపనీ చేసేందుకు లేదు. పరువుప్రతిష్ఠలు, మానమర్యాదలూ, క్రృతిమమైన సాంఘిక నియమాలు, సాలీడుదారాలు. తనకు ఏభై అన్నా నిండక ముందే ముసలితనం వచ్చేసింది. సుభద్రకు నలభైదాటి మూడు వాలుగేళ్ళన్నా గడవకముందే, చప్పి దవుడలూ, ముసలి నవ్వులూ, ముడతల ఒళ్ళు. లోతైన కళ్ళు. రత్తాలు చూడు. దిబ్బరొట్టెలా వున్నది. ప్రకృతి సిద్ధంగా ఏ నియమాలకు, ఏ కృత్రిమమర్యాదలకూ తలఒగ్గకుండా ఏటిఒడ్డున చెట్టులా, అడవిలో పారే ఏరులా, అందమైన కొండలా స్వేచ్ఛగా, తృప్తిగా బ్రతుకుతోంది రత్తాలు. ఆకాశంలా, భూమిలా, రత్తాలు వయ సొచ్చినా, బిగువుగా, బింకంగా బిర్రుగా వుంది. ఛీ, తానూ మనిషేనా. బ్రతుకంతా భయమే. అడుగడుగునా ఆత్మవంచనే. ఒక్కసారి సుఖంకోసం కాకపోయినా, తన పిరికితనాన్ని తోసి పారేసేందుకైనా రత్తాలును తాకాలి. అని ఒక అల.

రావుకి కళ్ళముందు అనేక దృశ్యాలు. పురిటిగదిలో సుభద్ర. పెద్దకొడుకు టైఫాయిడ్. కూతురుకు చిన్నపిల్ల చేష. మళ్ళీ నీతి. సంఘం. పెద్దమనిషి. పిల్లలతండ్రి.

రత్తాలు అవహాస్యంగా నవ్వుతున్నది. బయటవాన నిలి చింది. తాను ఇప్పటివరకూ తన ప్రజ్ఞ కాకపోయినా,సమయం, సందర్భం కూడకనో, ఏమో, ఇంకోస్త్రీని ముట్టలేదు. ఇప్పుడు ఏభైలో పడుతూ ఛీ, నీ జన్మఎప్పుడూ ఇంతే. నీపిరికి తనం ఇంతాఅంతాకాదు. అని మనస్సు ఎత్తి పొడుస్తున్నది. ఒక్కసారి ఇప్పుడు, ఏం ఏమైతే—అని ఇంకో అల.

రావు లేచాడు.

రత్తాలు లేచింది. రావు చూశాడు. ఒణుకుతూ బిడియ పడుతూ 'తలుపు' అని నీళ్ళు నమిలాడు.

రత్తాలుకు జాలైంది.

'అయ్యగారూ!' అన్నది సానుభూతి ధ్వనించేట్టు. రావుకి తల తిరిగిపోయింది.

'ఇవాళ పెద్దమ్మగారికి పసుపు కుంకుమ చేత్తుండారట. ఆ యమ్మను నేను ఎత్తుకొన్నాను. అదుట్టం. అయ్యా, పున్నెం జేత్తే బత్కుకు పండుతుంది.'

రావు రత్తాలువేపు నడవలేకపోయినాడు.

రత్తాలు తలుపు దగ్గరకు నడిచింది. అయితే రావు తల వంచుకుని తలుపుదాటిన తరువాత తలుపులు మూసింది.

ఆ వీధిన ఎవరైనా తనకు ఎదురైతే. అని తల వంగి పోతున్నది రావుకు.

శరీరమంతా అలసిపోయింది. సోలిపోతోంది. అసహ్యం, ఏవగింపూ. తనమీదే తనకు, ఎందుకో. తనపిరికితనాన్ని తలచు కొనీ. తన భయాన్ని తలచుకొని.

తన సంసారమంటే ఏవగింపు కలుగుతున్నది.

అందరికీతాను, సంతోషం, సౌఖ్యం, ఆలనా, పాలనా, రక ణా కల్పించేవాడు. తాను వాళ్ళకు గాఢంగా కావలెనో! వద్దో.

ఇంట్లోకివెళ్ళి తనగదిలో కూచున్నాడు.

ఎవరితో మాట్లాడాలనిపించలేదు. పేరంటాళ్ళందరూ వెళ్ళినట్లున్నారు.

సుభద్ర వచ్చింది. చేతిలో చిన్నపళ్ళెంలో ఏదో టిఫిన్ తీసుకుని. సుభద్రవేపు విచిత్రంగా చూశాడు రావు.

'మీరు మధ్యాహ్నం కూడా సరిగా భోజనం చేయలేదు'.

పెద్దబాబు, గదిలోకి పరిగెత్తినట్లుగా 'నాకు ఫస్ట్‌క్లాస్ వచ్చింది నాన్నారూ' అన్నాడు. 'ఇందాక మారామం-కు వాళ్ళన్నయ్య టెలిగ్రాం ఇచ్చాడు. యూనివర్శిటీనుండి'. పెద్ద బాబు ఇక అక్కడ క్షణంవుండలేదు.

సుభద్ర దగ్గరగావచ్చి 'స్నానం చేయండి. బాగా అలసి పోయినట్లున్నారు. అమ్మడు మీగూర్చి వందసార్లడిగింది.

రావు మనస్సు ఎందుకో ఆర్ద్రమైపోయింది.

రత్తాలు ప్రకృతిలా యథేచ్ఛగా ఏ నియమాలకు,నిబంధ ధనలకూ తననుతాను బంధించుకోక, స్వేచ్ఛగా బ్రతుకుతున్నది అదృష్టవంతురాలనీ, ఇవాళ ఇంతకుముందు తాననుకున్నాడా?

లేదా? రత్తాలు బ్రతుకులో పెద్దబాబు సంతోషం, అమ్మడి అభిమానం, అనుభవానికి వచ్చేనా—

అయ్యో, ఇవాళ ప్రొద్దుటునుంచీ తానెంత దిగజారి పోయినాడు, తన మనస్సూ శరీరమూ అలసిపోయినాయి. ఇరుకై పోయినాయి. మురికై పోయినాయి.

స్నానం చేసి, సిగరెట్ కాల్చుకుంటూ, కాసేపు సేదదీర్చు కుంటేకాని మళ్ళీతాను, తానుకాలేడు.

రావు లేచి హాల్లోకి వెళదామని కదిలాడు, పరధ్యానంగా.

తనకళ్ళు వాస్తవమైన విషయాన్నే చూస్తున్నాయా?

తన కన్నతల్లి, తనవెత్తురు, తన అమ్మడు బరువుగా, భారంగా, పెద్దపూలజడతో, అలుపుతోకూడినవవ్వగలతృప్తితో తనకాళ్ళదగ్గరవంగి వమస్కారంగా తాకుతున్నది తనపాదాలను.

సిగ్గుగా, బరువుగా, లోపలకు వెళ్ళిపోయింది.

రావు క్షణంసేపు కాలుకదల్చలేక, తరువాత చెమ్మగిలిన కళ్ళను చేతులతో తుడుచుకున్నాడు.

తాను పిరికివాడైతే ఫరవాలేదు. అల్పుడుకాకుండా వుంటే అదే చాలును. జీవితంలో ప్రతివిషయాన్నీ ఆవైపూ, యీ వైపూకూడా చూడాలి. ప్రతివస్తువుకూ, ఆటువైపూ, ఇటు వైపూవుండితీరుతాయి. అవతలివైపుకూడా చూపినవాడే అచ్చ మైన విజాన్ని తెలుసుకోగలుగుతాడు.